- కేసీఆర్ పాలనలో కరువు లేని రాష్ట్రం
- రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్
- కాళేశ్వరం ప్యాకేజీ-27 ప్రారంభం

# ఆగం కావద్దు.. సంక్షేమం మరువద్దు


గుండంపల్లిలో మంత్రులు కేటీఆర్, అల్లోలకు గజమాల వేసి సత్కరిస్తున్న రైతులు, నాయకులు

దిలావర్‌పూర్/లక్ష్మణచాంద/సారంగాపూర్, అక్టోబర్ 4 : 'ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీలు చెప్పే మాటలు నమ్మి ఆగం కావద్దు.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని మరువద్దు..' అని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల రామారావు ప్రజలకు సూచించారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి సమీపంలోని శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్‌తో రూ.714 కోట్లతో ఏర్పాటు చేసిన కాళేశ్వరం ప్యాకేజీ ప్యాకేజీ-27 (శ్రీ లక్ష్మీ నరసింహస్వామి) ఎత్తిపోతల పథకాన్ని బుధవారం రాష్ట్ర అటవీ, పర్యావరణ, నాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అంతకుముందు హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో గుండంపల్లికి చేరుకున్న మంత్రి కేటీఆర్‌కు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ముథోల్ ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్ రెడ్డి, ఎమ్మెల్సీ దండె విఠల్, ఐడీసీ చైర్మన్ వేణుగోపాలా చారీ ఘన స్వాగతం పలికారు. అనంతరం గుండంపెల్లి గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ప్యాకేజీ-27 పంపుహౌస్‌కు చేరుకున్నారు. సంబంధిత శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పక్కనే ఉన్న పంపహౌస్ బటన్‌నొక్కి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి నేరుగా దిలావర్‌పూర్ సమీపంలోని డిస్ట్రిబ్యూటరీ సిస్టర్న్ వద్దకు చేరుకున్నారు. గోదావరికి ప్రత్యేక పూజలు చేశారు. తమ గ్రామానికి వచ్చిన మంత్రి కేటీఆర్‌ను చూసి ఉప్పొంగిపోయిన గుండంపల్లి రైతులు, మంత్రులు కేటీఆర్, అల్లలోను భారీ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. 55 ఏండ్లు అధికారంలో ఉండి ఏమీ చేయలేని కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ఒక్కసారి అవకాశం ఇవ్వండని అడగడం సిగ్గుచేటన్నారు. ఆరు పథకాలతో మోసం చేయడానికి సిద్ధమవుతున్నారని, ఓటర్లు వారి మోసాన్ని పసిగట్టాలని పేర్కొన్నారు. తల్లికి అన్నం పెట్టనివాడు, పినతల్లికి బంగారు గాజులు చేయిస్తామన్న చందంగా ఆ పార్టీ మాటలు ఉన్నాయన్నారు. వారి మోసాలను తెలంగాణ ప్రజలు నమ్మబోరని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో 15 నీటి పారుదల ప్రాజెక్టులు పూర్తిచేశారని స్పష్టం చేశారు. రాష్ట్ర ఏర్పాటు కాకముందు ఎవరూ పట్టించుకోలేదన్నారు. నేడు ప్రాజెక్టులు నీటితో పరుగులు పెడుతున్నాయని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆనాడు ప్రారంభించి వదిలేసిన ప్రాజెక్టులను సీఎం కేసీఆర్ పూర్తిచేశారన్నారు. ఇటీవల చనాక కొరాట ప్రాజెక్టు ట్రయల్ రన్ పూర్తయ్యిందని చెప్పారు. రాష్ట్రం ఏర్పడకముందు ఆదిలాబాద్ జిల్లాలో రూ.5వేల నుంచి రూ.10 వేలు ఉన్న ఎకరం ధర నేడు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలకు పెరగడానికి కారణం తాము చేసిన అభివృద్ధేనని స్పష్టం చేశారు. అలాగే సమైక్య రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు వేసవిలో పల్లెలకు వెళ్లాలంటే అక్కడి మహిళలు ఖాళీ బిందెలు, కుండలతో అడ్డుకుంటారన్న భయం ఉండేదన్నారు. కానీ, ప్రత్యేక రాష్ట్రంలో మిషన్ భగీరథతో ప్రతీ తండా, గూడేనికి తాగునీరు అందుతున్నదని, ఆడబిడ్డ కండ్లల్లో ఆనందం నింపిన ప్రభుత్వం తమదని స్పష్టం చేశారు. అలాగే సాగు ప్రారంభానికి ముందుగానే రైతుల ఖాతాలో రైతు బంధు జమ అవుతున్నదని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటివరకు 70 లక్షల మంది ఖాతాల్లో రూ.73 కోట్లు జమచేసిందని వివరించారు. 13 లక్షల మంది ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి, షాదీముభారక్ పథకం కింద ఆర్థిక సాయం అందించి, వారి కుటుంబానికి అండగా నిలిచామన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోనే మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసామని తెలిపారు. ముథోల్ నియోజకవర్గంలో 100 పడకల దవాఖాన ఏర్పాటుచేసి, అందరికీ నాణ్యమైన వైద్యం అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో సన్నబియ్యంతో మధ్యాహ్న భోజ నం అందిస్తున్నామని గుర్తుచేశారు. రాష్ట్ర వ్యా ప్తంగా 1001 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలు ప్రారంభించి, 6.50 లక్షల విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు, రుచికరమైన భో జనం, ఉచిత దుస్తులు, పుస్తకాలు అందజేస్తున్నామని వెల్లడించారు. ఒక్కో విద్యార్థిపై రూ.1.20 లక్షలను ప్రభుత్వం ఖర్చుచేస్తున్నదన్నారు.

### 24 కరెంట్‌పై ఆరోపణలు హాస్యాస్పదం..

తాము చేసిన పనులు చెప్పుకుంటూ ప్రజల వద్దకు వెళ్తుంటే రైతులకు 24 గంటల కరెంటు ఎక్కడ ఉన్నదని కాంగ్రెస్ పార్టీ ఎంపీ కోమట్‌రెడ్డి వెంకట్‌రెడ్డి అనడం హాస్యాస్పదంగా ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. 'కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మీ పార్టీ నాయకులను మీరు చెప్పిన సమయానికి, మీరు చెప్పిన చోటుకే తీసుకొని వెళ్దాం. అక్కడ కరెంటు తీగలను పట్టుకొని చూస్తే తెలుస్తది 24 గంటల కరెంటు వస్తుందో లేదో. అప్పుడు మీరు, మీ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రాజీనామాకు సిద్ధం కండి.. అని మంత్రి కేటీఆర్ సవాలు విసిరారు. నాడు గ్రామాల్లో ఎవరైనా చనిపోతే మోటర్ల వద్ద స్నానం చేసేందుకు కరెంట్ కోసం అధికారులను బతిమిలాడే రోజులుండేవని గుర్తుచేశారు. ఇప్పుడు అలాంటి తిప్పలున్నాయా అని ప్రజలను నేరుగా అడిగారు. దేశంలో ఎక్కడా లేనివిదంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న తమ ప్రభుత్వాన్ని, మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని, ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్‌రెడ్డితో పాటు, ఎమ్మెల్యే అభ్యర్థులందరినీ ఆశీర్వదించాలని కోరా రు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సంగీత, నిర్మల్ జడ్పీ చైర్మన్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థులు రాథోడ్ జాన్సన్ నాయక్, అనీల్ జాదవ్, ఎంపీపీ పాల్దె అక్షర, జడ్పీటీసీ రమణారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ముల చిన్న దేవేందర్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్ పీవీ రమణారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్ రెడ్డి, నాయకులు పాల్దె అనీల్, ఏలాల చిన్నారెడ్డి, ఏలాల అమృత, కొమ్ముల సవిత, గంగారెడ్డి, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అశృతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అపర భగీరథుడు కేసీఆర్

- నాడు నీళ్ల కోసం కొట్లాటలు జరిగేవి
- నేడు 24 గంటల కరెంట్‌తో అన్నదాతకు వ్యవసాయ పండుగ
- భవిష్యత్ తరాలకు ఆయిల్ పామ్ పంటతో భరోసా
- పోచంపాడ్‌లో ఫ్యాక్టరీ శంకస్థాపనలో మంత్రి కేటీఆర్


సోన్ : పోచంపాడ్‌లో ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న మంత్రులు కేటీఆర్, అల్లోల, జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

నిర్మల్ టౌన్/సోన్, అక్టోబర్ 4 : 'ప్రజల కోసం ఆనాటి భగీరథుడు పైనున్న నీళ్లను కిందికి తీసుకొస్తే.. ఈనాటి అపర భగీరథుడు, సీఎం కేసీఆర్ కింద నీళ్లను పైకి తెచ్చి కాళేశ్వరం నీటితో ప్రతీ ఎకరాకు సాగునీరు అందిస్తున్నారని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ఫ్రీ యూనిక్ కంపెనీ ఆధ్వర్యంలో సోన్ మండలం పోచంపాడ్ గ్రామ శివారులో రూ. 300 కోట్లతో నిర్మించే ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి మంత్రి అల్లోలతో కలిసి భూమి పూజ చేసి, శంకుస్థాపన చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టును హెలికాప్టర్ ద్వారా వీక్షించిన మంత్రి కేటీఆర్.. ప్రాజెక్టు సముద్రంగా మారిందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుపై గతంలో మహారాష్ట్ర ప్రభుత్వం అక్రమ ప్రాజెక్టులు నిర్మిస్తే నీరు రాక ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాల రైతులు కాకతీయ కాలువలపై నిద్రాహారాలు మాని కొట్లాటలకు దిగిన మాట వా స్తవం కాదా అని రైతులను అడిగారు. సీఎం కేసీఆర్ శ్రీరాంసాగర్‌కు సజీవ జలకళ అందించాలన్న ఉద్దేశంతో కాళేశ్వరం నీటిని ఎగువకు ఎత్తిపోస్తూ ప్రాజెక్టుకు మళ్లించే కార్యక్రమం చేపట్టారన్నారు. రూ.714 కోట్లతో ప్యాకేజీ-27 ద్వారా 50వేల ఎకరాలకు సాగునీరు అందుతున్నదని భరోసానిచ్చారు. కాంగ్రెస్ హయాంలో కాలువలపై మోటర్లు పెడితే కరెంటోళ్లు తీసుకెళ్లేవారని, తీగలను కట్‌చేసేవారని గుర్తు చేశారు. ఇప్పుడు నిరంతర కరెంటు, ప్రాజెక్టుల ఆధునీకరణతో రాష్ట్రం సస్యశ్యామలమైందన్నారు.

### భవిష్యత్ తరాలకు ఆయిల్ పామ్‌తో ఆదాయం..

దేశంలో అన్ని వర్గాల ప్రజలు వినియోగించుకునే నిత్యావసర వస్తువుల్లో వంట నూనె ప్రధానమైందని, మలేషియా, ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకునే దుస్థితికి కేంద్ర విధానమే కారణమని మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. దీని వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలోపెట్టుకొని తెలంగాణ సర్కారు ఆయిల్‌పామ్ సాగుపై ప్రోత్సాహం అందిస్తున్నదన్నారు. ఇం దులో భాగంగా నిర్మల్‌లో రూ.300 కోట్లతో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మిస్తున్నట్లు చెప్పారు. నిర్మాణం పూర్తయితే నిర్మల్, నిజామాబాద్, సిరిసిల్ల, ఆదిలాబాద్ జి ల్లాల్లోని ఆయిల్ పామ్ రైతులకు ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. రెండేండ్లలో ఫ్యాక్టరీని పూర్తి చేసి, వెయ్యి మందికి స్థానికంగా ఉపాధి కల్పిస్తామని చెప్పారు.

### అల్లోల గెలిస్తేనే మరింత అభివృద్ధి..

సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న, ప్రజల మధ్య ఉంటున్న ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించడం వల్లే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. వచ్చే ఎన్నికల్లో నిర్మల్ నుంచి ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్‌రెడ్డి, జాన్సన్ నాయక్‌ను గెలిపించి, కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అయ్యేందుకు అవకాశం కల్పించాలని ప్రజలను కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ వాగ్దానాన్ని ప్రభుత్వం నెరవేర్చిందని గుర్తుచేశారు.

### మంత్రులకు ఘన స్వాగతం..

ప్రత్యేక హెలికాప్టర్‌లో వచ్చిన మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్, ఎమ్మెల్సీ దండె విఠల్, ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారికి జిల్లా నాయకులు ఘన స్వాగతం పలికారు. ఇక్కడ రూ.300 కోట్లతో నిర్మించే ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులకు భూమిపూజ, శంకుస్థాపన చేశారు. మొసళ్ల సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీఎస్పీ గంగారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, పంచాయతీరాజ్ కమిషనర్ హన్మంత్‌రావు, జడ్పీటీసీ జీవన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాజేశ్ బాబు, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్, రైతు బంధు సమితి కన్వీనర్ వెంకట్రామ్‌రెడ్డి, సోన్ మండల కన్వీనర్ మొహినొద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర అధ్యక్షుడు గంగారెడ్డి, ఆయిల్‌ఫామ్ నిర్వాహకులు మోహన్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి శ్యాంరావురాథోడ్, డీఆర్‌డీవో విజయలక్ష్మి, సర్పంచ్ మమత, గంగారెడ్డి పాల్గొన్నారు.


మంత్రి కేటీఆర్‌కు నాగలి బహూకరిస్తున్న రైతులు, నాయకులు

# మంత్రి కేటీఆర్‌ను కలిసిన నాయకులు..

దిలావర్‌పూర్, అక్టోబర్ 4 : మంత్రి కేటీఆర్‌ను మండలంలోని గుండంపల్లి, దిలావర్‌పూర్ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కలిశారు. నాగలిని బహూకరించి, డ్రాగన్ ఫ్రూట్ అందించారు. తమ గ్రామ పరిసర ప్రాంతంలోని ఇథనాల్ పరిశ్రమను వేరే ప్రాంతాలకు తరలించాలని, దిలావర్‌పూర్ జాతీయ రహదారి నుంచి గుండంపల్లి ప్యాకేజీ-27 వరకు బీటీ రోడ్డు, గుండంపల్లిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ కళ్యాణ మండప నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అక్షర, జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు డాక్టర్ సుభాష్‌రావు, సహకార సంఘం చైర్మన్ పీవీ రమణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు కొమ్ముల దేవేందర్‌రెడ్డి, ఏలాల చిన్నరెడ్డి, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు కోడే రాజేశ్వర్, పాల్దే అనీల్, పాల్దే శ్రీనివాస్, పూజారం మహేశ్, కోడే నవీన్, దనే రవి, సప్పుల రవి, గుణవంతురావు, గంగారెడ్డి తదితరులు ఉన్నారు.


గుండంపల్లి వద్ద మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు